# మంచి వార్త

## మొక్కల పాలిట నీలమేగం



**తమిళనాడు** రాష్ట్రం తిరుచిరాపల్లిలోని పొన్‌మలైలో గోల్డెన్ రాక్ వర్క్‌షాప్ ప్రాంతం. అక్కడ ఆధునిక యాంత్రిక నాగరికతకు సంకేతాలుగా యంత్రాల మోత, పనిముట్ల చప్పుళ్లు వెలువడుతూ ఉంటాయి. కేసీ నీలమేగం ఈ వర్క్‌షాప్‌లోనే సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆయన యంత్రాలకు మరమ్మతులు చేయడమే కాకుండా, మొక్కలు నాటుతూ మన జీవగడ్డ నేలతల్లినీ ప్రేమగా చూసుకుంటున్నారు. సెలవు రోజులు, విరామ సమయాల్లో ఆయన 1989 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నారు మరి! అలా ఇప్పటివరకు మూడువేలకు పైగా మొక్కలను నీలమేగం పెంచి పెద్దచేశారు. అందుకే ఆయనకు 'తిరుచ్చి ఆకుపచ్చటి యోధుడు' అనే పేరువచ్చింది. అంతేకాదు చెట్ల పెంపకం ప్రాధాన్యం గురించి సాటివారికి వివరించడానికి వచ్చే ఏ ఒక్క అవకాశాన్ని కూడా నీలమేగం వదులుకోడు. స్థానిక విద్యాసంస్థల్లో పర్యావరణ పాఠాలను కూడా బోధిస్తుంటాడు. ''మొక్కలు నాటే విషయంలో నాకంటూ ఓ లక్ష్యాన్ని పెట్టుకోను. ఎన్ని మొక్కలు వీలైతే అన్ని నాటడానికి ప్రయత్నిస్తాను'' అని నీలమేగం ఆనందంగా చెబుతాడు. 1997లో తన పెళ్లికి వచ్చిన అతిథులకు మొక్కలను బహుమానంగా ఇచ్చాడు నీలమేగం. ఆ పద్ధతిని ఇప్పటికీ కొనసాగిస్తున్నాడు. మొక్కలు నాటడానికి డ్రైవ్స్ నిర్వహిస్తుంటాడు. గుడ్డ సంచుల వాడకాన్ని ప్రోత్సహిస్తాడు. పర్యావరణ అనుకూల జీవితం ప్రాధాన్యం గురించి వర్క్‌షాప్‌లు ఏర్పాటుచేస్తుంటాడు. వెయ్యేండ్ల కింద చోళ రాజులు కావేరి నది నుంచి తీసిన ఉయ్యకొండన్ కాలువను కాలుష్యం బారి నుంచి కాపాడటానికి తనవంతు చేయూత అందించాడు. విత్తన బంతులను వెదజల్లే కార్యక్రమం చేపట్టి, స్థానిక యువకులకూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కల్పించాడు. వచ్చే ఏడాది పదవీ విరమణ పొందనున్న నీలమేగం ఆ తర్వాత తన కార్యక్రమాన్ని మరింత క్రియాశీలం చేస్తానని పేర్కొంటున్నాడు. కాగా ఆయన ప్రయత్నంలో కుటుంబం కూడా అండగా నిలుస్తున్నది. మొక్కలు నాటడంతోపాటు వాటికి నీళ్లు పోయడం, అవి సరిగ్గా పెరగడానికి తగిన చర్యలు తీసుకోవడం పట్ల కూడా శ్రద్ధ చూపుతాడు. ఎప్పుడూ ఏదో ఒకచోట మొక్కలు నాటుతూనే ఉంటాడని స్థానికులు ఆయనను అపురూపంగా చూసుకుంటారు. ఆయన గురించి గొప్పగా చెప్పుకొంటారు. పచ్చదనం తగ్గుతున్న పరిస్థితుల్లో భూమికి కావాల్సింది నీలమేగం లాంటివాళ్లే.

## వైతాళికుల వాణి

మనలో దాగిన సామర్థ్యాన్ని వెలికితీసేది నిరంతర ప్రయత్నమే తప్ప... బలమో, తెలివితేటలో కాదు.

• **విన్‌స్టన్ చర్చిల్**

(బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి)

## క్యా సీన్ హై!

